చవితికి గణనాథులు సిద్ధం

- కొనుగోలు చేసేందుకు వస్తున్న మండపాల నిర్వాహకులు
- 27న వినాయక చవితి


అమ్మకానికి సిద్ధంగా ఉన్న గణనాథులు

నిజామాబాద్ రూరల్: జిల్లా కేంద్రంలో వినాయక చవితికి గణనాథులు సిద్ధంగా ఉన్నాయి. ఈ నెల 27న గణనాథులను ప్రతిష్ఠించనున్న నేపథ్యంలో నగరంలోని కంఠేశ్వర్, పెద్దబజార్, వినాయక్‌నగర్ ప్రాంతాల్లో ఉన్న గణేశ్ విగ్రహాల విక్రయ కేంద్రాలు మండపాల నిర్వాహకులు, యువజన సంఘాల సభ్యులతో సందడి నెలకొంది. విగ్రహాల తయారీ కేంద్రాల్లో అనేక రకాల గణనాథులు రూ.5 వేల నుంచి రూ.20 వేల వరకు అందుబాటులో ఉన్నాయి. వీటిని తయారు చేసేందుకు రాజస్థాన్ నుంచి కొందరు కళాకారులు గత 20 ఏళ్లుగా జిల్లా కేంద్రానికి వస్తూ ఉపాధి పొందుతున్నారు. కానీ గతంలో కంటే ఈ సారి గణేశ్ విగ్రహాల విక్రయాలు అంతంత మాత్రమే జరుగుతున్నట్లు విక్రయదారులు పేర్కొంటున్నారు.

గిరాకీ తక్కువగా ఉంది



గత ఏడాదితో పోలిస్తే గణేశ్ విగ్రహాల గిరాకీ ఈ సారి తక్కువగా ఉంది. గతంలో రూ. 40 వేల వరకు విగ్రహాలను అమ్మేవాళ్లం. ఈ సారి రూ. 20వేల వరకే అమ్మకాలు పరిమితమవుతున్నాయి.

– వరదరాం, వ్యాపారి

క్లుప్తంగా

నగరంలో కలెక్టర్ తనిఖీలు



నిజామాబాద్ సిటీ: నగరంలో చేపడుతున్న ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమాలను కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆర్యనగర్, ప్రగతినగర్, ఖిల్లా రోడ్ తదితర ప్రాంతాల్లో జరుగుతున్న పనులను పరిశీలించారు. నివాస ప్రాంతాలలో క్రమం తప్పకుండా పారిశుద్ధ్య పనులు జరిగేలా పకడ్బందీ పర్యవేక్షణ చేయాలని సూపర్‌వైజర్ సాజిద్‌ఖాన్‌ను ఆదేశించారు. వర్షాకాలం నేపథ్యంలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ముందస్తుగా అప్రమత్తతతో కూడిన చర్యలు తీసుకోవాలన్నారు. తడి, పొడి చెత్తను వేర్వేరుగా సేకరించేలా చూడాలన్నారు. డ్రైనేజీలలో చెత్తాచెదారం పేరుకుపోయి, మురుగునీరు నిల్వకుండా శుభ్రం చేయించాలని ఆదేశించారు.

పెన్షన్ చెల్లించాలి



నిజామాబాద్ నాగారం: తెలంగాణలోని వివిధ మార్కెటింగ్ కమిటీ శాఖల్లోని రిటైర్డ్ ఉద్యోగులకు అందాల్సిన పెన్షన్లు పెండింగ్‌లో ఉంటున్నాయని వెంటనే వాటిని మంజూరు చేయాలని మార్కెటింగ్ కమిటీ రిటైర్డ్ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు బన్సీలాల్ పేర్కొన్నారు. బుధవారం నాందేవ్‌వాడలోని పెన్షనర్స్ భవన్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. మార్కెటింగ్ కమిటీకి సంబంధించిన రూ. కోట్ల డబ్బు ప్రభుత్వం వద్ద ఉన్నా రిటైర్డ్ ఉద్యోగులకు మాత్రం నెలనెలా పెన్షన్లు చెల్లించేందుకు ముందుకు రావడం లేదన్నారు. సమావేశంలో ప్రధాన కార్యదర్శి రాజేందర్, నాయకులు పూర్ణచంద్ర రావు, బాలయ్య, శంకర్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

సేవా రంగంలో రోటరీ ముందంజ



నిజామాబాద్ రూరల్: ప్రపంచ వ్యాప్తంగా సేవా రంగంలో రోటరీ క్లబ్ సేవా సంస్థ ముందుందని క్లబ్ డిస్ట్రిక్ గవర్నర్ ఎస్‌వీ రామ్‌ప్రసాద్ అన్నారు. నగరంలోని ఓ ప్రయివేట్ హోటల్‌లో బుధవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. అంగవైకల్యం ఉన్న వారికి నూతన పద్ధతుల్లో కృత్రిమ అవయవాల బిగింపులో రోటరీ క్లబ్ ఆఫ్ జేమ్స్ కీలకపాత్ర పోషిస్తోందని పేర్కొన్నారు. కార్యక్రమంలో పాకాల నరసింహారావు, గంజి రమేశ్, జయపాల్ రెడ్డి, పడాల సత్తయ్య, శ్యామ్ అగర్వాల్, గోవింద్ జవహర్, వంజరి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

రేషన్ కార్డుల పంపిణీ



సిరికొండ: మండలంలోని న్యావనంది, తాళ్లరామడుగు గ్రామాల్లో కొత్త రేషన్ కార్డులను లబ్ధిదారులకు కాంగ్రెస్ నాయకులు బుధవారం పంపిణీ చేశారు. తాళ్లరామడుగులో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బాకారం రవి, బాకారం సంతోష్, కుందేళ్ల శ్రీనివాస్, బండారి నరేశ్, న్యావనందిలో యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ప్రవీణ్ వీరు, ఏఎంసీ డైరెక్టర్ ముత్తెన్న, నరేందర్, మహిపాల్, జనార్దన్, సాగర్, తేజ, సుమన్ తదితరులు పాల్గొన్నారు.



బంగారం ధరలు (10గ్రాములు)

24 క్యారెట్స్	100,900	వెండి(కిలో)	1,17,300
22 క్యారెట్స్	93,147		

– నిజామాబాద్ బిజినెస్

మాంసం ధరలు

చికెన్	ధరలు	డ్రెస్డ్	180
	(కిలోకు)	లైవ్	140
స్కిన్‌లెస్	200	మటన్	800

కూరగాయల ధరలు(రూ.)

	హోల్‌సేల్	రిటైల్		హోల్‌సేల్	రిటైల్
టమాట	30	50	గాజరుగడ్డ	30	60
బెండకాయ	30	60	పచ్చిమిర్చి	30	60
బీరకాయ	30	60	దోసకాయ	15	30
దొండకాయ	25	50	ఆలుగడ్డ	20	40
బీర్నీసుకాయ	70	120	గోబిగడ్డ	15	30
కాకరకాయ	30	60	గోబిపువ్వు	25	50
వంకాయ	30	60	బీట్‌రూట్	30	60
పాలకూర	40	80	కరివేపాకు	40	80
మెంతికూర	40	80	చామగడ్డ	30	60
కొత్తిమీర	30	60	చిక్కుడుకాయ	30	60
పుదీనా	40	80	గోరుచిక్కుడు	40	80
క్యాప్సికం	25	50			

–సుభాష్‌నగర్

యూజీడీ పనులపై అవగాహన


విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న డీసీ రవిబాబు


కాలూరులోని సివరేజ్ ప్లాంట్‌ను పరిశీలిస్తున్న విద్యార్థులు

నిజామాబాద్ సిటీ: మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో జరుగుతున్న భూగర్భ డ్రెయినేజీ వ్యవస్థ పనులపై విద్యార్థులకు మున్సిపల్ అధికారులు అవగాహన కల్పించారు. బుధవారం 1వ డివిజన్ పరిధిలోని కాలూరులో మురుగునీటి శుద్ధి కేంద్రం పనితీరును విజ్ఞాన్ పాఠశాలకు చెందిన విద్యార్థులకు అవగాహన కల్పించారు. మున్సిపల్ డిప్యూటీ కమిషనర్ రవిబాబు డ్రెయినేజీ వ్యవస్థ, పారిశుద్ధ్య పనులపై విద్యార్థులకు వివరించారు. ప్లాస్టిక్ వల్ల కలిగే దుష్పరిణామాలు, హానికరమైన చెత్త, ఇంటి వ్యర్థాలను తడి, పొడి చెత్తపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. అనతరం నగరాన్ని చెత్తరహిత నగరంగా మార్చేందుకు కృషి చేస్తామని విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. విద్యార్థులు, ఉపాధ్యాయులు, పారిశుద్ధ్య సిబ్బంది పాల్గొన్నారు.

జంబి గద్దె నిర్మాణానికి భూమిపూజ



మోపాల్: మండలంలోని ముదక్‌పల్లిలో జంబి గద్దె, లచ్చవ్వ ఆలయ నిర్మాణానికి నిజామాబాద్ మార్కెట్ కమిటీ చైర్మన్ ముప్ప గంగారెడ్డి బుధవారం భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ముప్ప గంగారెడ్డి మాట్లాడుతూ.. వర్షాలు సమృద్ధిగా కురిసి పాడి పంటలు బాగా పండాలని అమ్మవారిని వేడుకున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో గ్రామాభివృద్ధి కమిటీ అధ్యక్షుడు ఎర్ర సాయిలు, కాంగ్రెస్ గ్రామ అధ్యక్షుడు ఈదుల్ల సాయిలు, వీడీసీ ప్రతినిధులు పాల్గొన్నారు.

మహాధర్నా పోస్టర్ల ఆవిష్కరణ


గోడప్రతులను ఆవిష్కరిస్తున్న నాయకులు

మోపాల్: సీపీఎస్‌ను రద్దు చేసి ఓపీఎస్‌ను పునరుద్ధరించాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను కోరుతూ పీఆర్టీయూ టీఎస్ రాష్ట్ర సంఘం పిలుపు మేరకు సెప్టెంబర్ 1న హైదరాబాద్‌లో నిర్వహించే మహాధర్నా పోస్టర్లను బుధవారం మోపాల్ జెడ్పీహెచ్ఎస్‌లో నాయకులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పీఆర్టీయూ మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రవీంద్రకుమార్, దేవదాస్ మాట్లాడుతూ.. సీపీఎస్ అంతం పీఆర్టీయూ పంతమని పేర్కొన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు వెంకటేశ్వర్ గౌడ్, శ్రీనివాస్, గోవింద్, రాష్ట్ర కార్యదర్శి రమేశ్, నాయకులు, ఉపాధ్యాయులు రాజ మల్లయ్య, అక్బర్ బాషా, అజార్, శ్రీనివాస్, గణేశ్, భారతి, సునీత, రాజశేఖర్, మహేందర్, ప్రవీణ్‌రెడ్డి, సాయన్న తదితరులు పాల్గొన్నారు.

సిరికొండ: సీపీఎస్‌ను రద్దు చేసి ఓపీఎస్‌ను పునరుద్ధరించాలనే డిమాండ్‌తో హైదరాబాద్‌లో సెప్టెంబర్1న పీఆర్టీయూ టీఎస్ ఆధ్వర్యంలో మహాధర్నాను నిర్వహించనున్నట్లు సంఘం మండల అధ్యక్షుడు మోజీరామ్ తెలిపారు. మండల కేంద్రంలోని విద్యావనరుల కేంద్రం వద్ద ధర్నాకు సంబంధించిన వాల్ పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎంఈవో రాములు, ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్‌రావు, జిల్లా ఉపాధ్యక్షుడు చిలుక శ్రీనివాస్, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు లక్ష్మారెడ్డి, దయాసింగ్, రవీందర్, సాయికుమార్, గోపి, సంతోష్, రాంచందర్ తదితరులు పాల్గొన్నారు.

యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడికి పరామర్శ



సిరికొండ: మండలంలోని తూంపల్లికి చెందిన నిజామాబాద్ రూరల్ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు మహేందర్‌ను మాజీ ఎమ్మెల్సీ ఆరికెల నర్సారెడ్డి బుధవారం పరామర్శించారు. మహేందర్ అన్న రాజు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. రాజు చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. డీసీసీ డెలిగేట్ చెలిమెల నర్సయ్య, బండారి నరేశ్, మోతె నవీన్‌రెడ్డి, సిరిపురం గంగారెడ్డి, మగ్గిడి రాంరెడ్డి, మాజీ జెడ్పీటీసీ మాన్‌సింగ్, బాల్‌రాజ్‌నాయక్, రాజేశ్వర్‌గౌడ్, లక్ష్మణ్, ఆసిఫ్, దిగంబర్, తిరుపతి, పురుషోత్తం, మాజీ సర్పంచ్ దేవరాజు, మాజీ ఎంపీటీసీ లింగం ఉన్నారు.

మాజీ ప్రధానికి ఘన నివాళులు


జిల్లా కేంద్రంలో రాజీవ్ గాంధీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పిస్తున్న నాయకులు


సిరికొండలో..

నిజామాబాద్ సిటీ: జిల్లా కేంద్రంలో మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ జయంతి వేడుకలను కాంగ్రెస్ పార్టీ నాయకులు బుధవారం ఘనంగా నిర్వహించారు. జిల్లా కేంద్రంలోని కాంగ్రెస్ భవన్, వినాయక్‌నగర్‌లోని రాజీవ్‌గాంధీ విగ్రహానికి పీసీసీ ప్రధాన కార్యదర్శి రాంభూపాల్, జిల్లా గ్రంథాలయసంస్థ చైర్మన్ అంతిరెడ్డి రాజిరెడ్డి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. జిల్లా ఎస్టీ సెల్ అధ్యక్షుడు కెతావత్ యాదగిరి, జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు విపుల్ గౌడ్, నాయకులు బొబ్బిలి రామకృష్ణ, కోనేరు సాయికుమార్, ఆకుల మహేందర్, వినయ్, అవిన్, సుభాష్ జాదవ్, రాజేంద్రప్రసాద్, బంటు బలరాం, పోల ఉష, అపర్ణ పాల్గొన్నారు.

సిరికొండ: మండల కేంద్రంలో మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీ జయంతి వేడుకలను కాంగ్రెస్ నాయకులు ఘనంగా నిర్వహించారు. పార్టీ మండల అధ్యక్షుడు బాకారం రవి, డీసీసీ కార్యదర్శి ఎర్రన్న, బాలరాజ్ నాయక్, దేగాం సాయన్న, చిన్నరెడ్డి, శోభన్, ఆసిఫ్, రాజేందర్‌రెడ్డి, నరేందర్, సురేందర్‌రెడ్డి, ప్రసాద్, రాజారెడ్డి, సంపత్‌రెడ్డి, రాంరెడ్డి పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి..



జక్రాన్‌పల్లి: మండలంలోని బ్రాహ్మణ్‌పల్లికి చెందిన బీజేపీ సీనియర్ నాయకుడు జగడం పోశన్న తల్లి జగడం నర్సు ఇటీవల మృతి చెందింది. బాధిత కుటుంబ సభ్యులను బీజేపీ జిల్లా అధ్యక్షుడు దినేశ్ కులాచారి పరామర్శించారు. ఆయన వెంట మాజీ ఎంపీపీ అనంత్‌రెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు కన్నెపల్లి ప్రసాద్, మండల ప్రధాన కార్యదర్శి కుంట శ్రీనివాస్, జిల్లా కార్యవర్గ సభ్యుడు కొప్పు రాజేందర్, బీజేవైఎం జిల్లా ఉపాధ్యక్షుడు వంశీగౌడ్, అధికార ప్రతినిధి సంజీవ్, నాయకులు శ్రీనివాస్‌గౌడ్, ఈర్ల బాలయ్య, భూమేశ్, వేణుపటేల్, మోహన్ తదితరులు పాల్గొన్నారు.

బంగారు సాయిలుకు అంతర్జాతీయ అంబేడ్కర్ అవార్డు



నిజామాబాద్ నాగారం: జిల్లావాసి, సామాజిక సేవా కార్యకర్త బంగారు సాయిలు అమెరికా దేశానికి చెందిన 'యూనివర్సిటీ ఆఫ్ టోలోసా' అంతర్జాతీయ అంబేడ్కర్ అవార్డును అందుకున్నారు. నగరంలోని ప్రెస్‌క్లబ్‌లో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో బంగారు సాయిలు మాట్లాడుతూ జీజీ కాలేజీలో ఎన్‌ఎస్‌ఎస్ కార్యకర్తగా ప్రస్థానం ప్రారంభించి నేటి వరకు చేసిన సేవల పేపర్ కటింగ్‌లను యూనివర్సిటీ ఆఫ్ టోలోసాకు పంపడంతో తనకు ఈ గుర్తింపు లభించిందన్నారు. జిల్లాలో ఈ అవార్డు సాధించిన వ్యక్తిని తాను ఒక్కడినేనని తెలిపారు. సమావేశంలో కోనేరు సాయికుమార్, అశోక్, షేక్ హుస్సేన్, పింకీ, కేశపల్లి రవి, సక్కి ప్రభంజన్ తదితరులు పాల్గొన్నారు.

అంబులెన్స్‌ను ఢీకొన్న లారీ

నిజామాబాద్ రూరల్: కంఠేశ్వర్ బైపాస్‌లోని డీఎస్ విగ్రహం వద్ద మంగళవారం అర్ధరాత్రి లారీ, 108 అంబులెన్స్ ఢీకొన్నట్లు రూరల్ ఎస్‌హెచ్‌వో మహ్మద్ ఆరీఫ్ తెలిపారు. హైదరాబాద్ నుంచి అర్సపల్లి వెళుతున్న లారీ, దాస్‌నగర్ నుంచి జీజీహెచ్‌కి వస్తున్న 108 అంబులెన్స్ బైపాస్ సిగ్నల్ వద్ద ఢీ కొన్నాయి. దీంతో అంబులెన్స్‌లో ఉన్న నలుగురికి గాయాలయ్యాయి. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు మరో అంబులెన్స్‌లో క్షతగాత్రులను తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు రూరల్ ఎస్‌హెచ్‌వో వివరించారు.

సంక్షిప్తం

కార్పొరేషన్‌లో అధికారుల ఇష్టారాజ్యం..

నిజామాబాద్ సిటీ: బల్దియాలో పాలకవర్గం లేకపోవడంతో మున్సిపల్ కార్పొరేషన్‌లోని ఉన్నతాధికారులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారని బహుజన లెఫ్ట్ ట్రేడ్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు దండి వెంకట్ బుధవారం విమర్శించారు. ఔట్ సోర్సింగ్ కార్మికులు మృతిచెందితే వారి కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వకుండా ఇబ్బందులు పెడుతున్నారని అన్నారు. కార్మికులకు నష్టం కలిగించిన అధికారులపై చర్యలు తీసుకొని వారి నుంచి నష్టపరిహారం ఇప్పించాలని డిమాండ్ చేశారు.

వైద్యాధికారులపై చర్యలు తీసుకోవాలి

డిచ్‌పల్లి: ఆశావర్కర్‌ను వేధింపులకు గురి చేసిన వైద్యాధికారులపై చర్యలు తీసుకోవాలని ఆశావర్కర్స్ యూనియన్(సీఐటీయూ) జిల్లా ఉపాధ్యక్షురాలు బొడికె స్వప్న డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం ఆశావర్కర్లతో కలిసి డిచ్‌పల్లి డిప్యూటీ తహసీల్దార్ శ్రీకాంత్‌కు వినతిపత్రం అందజేశారు. వేధింపులకు పాల్పడుతున్న అధికారులపై చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఆశా కార్యకర్తలు మంజుల, సునీత, రేణుక, జీఎస్ స్వప్న తదితరులు పాల్గొన్నారు.

ఫస్ట్ ఎయిడ్ కిట్లు అందజేత

మోపాల్: నిజామాబాద్ రూరల్, మోపాల్ మండలాల్లోని న్యాల్‌కల్, సిర్‌పూర్, మల్లారం, ధర్మారం(బి) గ్రామాల్లో ఉన్న జెడ్పీహెచ్‌ఎస్, ప్రైమరీ పాఠశాలలకు శ్రీ కృష్ణ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఫస్ట్ ఎయిడ్ కిట్లు బుధవారం అందజేశారు. ఈ సందర్భంగా ఫౌండేషన్ సభ్యుడు బాలకృష్ణ మాట్లాడుతూ.. విద్యార్థులకు అత్యవసర సమయంలో ఉపయోగంగా ఉంటాయనే ఉద్దేశంతో పాఠశాలలకు పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సభ్యులు సురేశ్, నరోత్తమ్ తదితరులు పాల్గొన్నారు.

ఒకరికి రెండు రోజుల జైలు

సిరికొండ: డయల్-100ను దుర్వినియోగం చేసిన కేసులో మండల కేంద్రానికి చెందిన పఠాన్ సద్దాం అనే వ్యక్తికి నిజామాబాద్ రెండో శ్రేణి మెజిస్ట్రేట్ రెండు రోజుల జైలు శిక్షను విధించినట్లు ఎస్సై కల్యాణి బుధవారం తెలిపారు. మద్యం మత్తులో డయల్-100కు అనవసరంగా ఫోన్ చేయడంతో కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

పదవీ కాలం పెంపుపై హర్షం



నిజాంసాగర్(జుక్కల్): సహకార సంఘాలతో పాటు జిల్లా సహకార బ్యాంకు పాలక వర్గాల పదవీ కాలం పెంపుపై ఉద్యోగులు, అధ్యక్షులు హర్షం వ్యక్తం చేశారు. బుధవారం జుక్కల్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో స్థానిక ఎమ్మెల్యే తోట. లక్ష్మీకాంతారావును ఉమ్మడి జిల్లా సహకార బ్యాంకు అధ్యక్షుడు రమేష్ రెడ్డి, చైర్మన్లు, డైరెక్టర్లు కలిశారు. ప్రభుత్వం తమ కాలపరిమితి పెంచడం పట్ల వారు సంతోషం వ్యక్తం చేశారు. అనంతరం ఎమ్మెల్యేను సన్మానించారు.

నేటి చిత్రం



బురదమయంగా హనుమాన్‌తండా రోడ్డు

మోపాల్: మండలంలోని మంచిప్ప నుంచి హనుమాన్ తండా వెళ్లే రోడ్డు బురదమయంగా మారింది. సుమారు అర కిలోమీటర్ వరకు రోడ్డు పూర్తిగా ప్రమాదకరంగా తయారైంది. వర్షం కురవడం, భారీ వాహనాలు నడవడంతో అటుగా వెళ్లే తండావాసులు, రైతులు తరచూ ప్రమాదాలకు గురవుతున్నారు. తాజాగా ఓ ఉపాధ్యాయుడు బైక్ అదుపు తప్పి పడిపోయాడు. ఇకనైనా అధికారులు స్పందించి రోడ్డును బాగు చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

– ప్రేమ్‌లాల్, ఉపాధ్యాయుడు

మాకు ఫొటో పంపండి

మీ ప్రాంతంలో నెలకొన్న సమస్యను, ఫొటోను మాకు వాట్సాప్‌లో పంపించండి. ప్రచురించి అధికారుల దృష్టికి తీసుకెళ్తాము. పంపిన వారి పేరు, ఫొటో ప్రచురిస్తాము.

నిజామాబాద్ అర్బన్ - 95531 30597 నిజామాబాద్ రూరల్ - 97053 46541

పాఠశాల ఆవరణలో మద్యం సీసాలు


పాఠశాల ఆవరణలో ఉన్న మద్యం సీసాలు


బురదమయంగా మారిన పాఠశాల ఆవరణ

- బురదమయంగా వెంకట్రాం నాయక్ తండా స్కూల్ పరిసరాలు

మోపాల్: మండలంలోని అమ్రాబాద్ జీపీ పరిధిలోని వెంకట్రాంనాయక్ తండా మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల ఆవరణ మందుబాబులకు అడ్డాగా మారింది. మద్యం సేవించిన మందుబాబులు బీరు సీసాలు అక్కడే పారేస్తున్నారు. అదేవిధంగా పాఠశాల ఆవరణమంతా బురదమయంగా మారింది. చుట్టూ పిచ్చిమొక్కలు ఏపుగా పెరిగాయి. దీంతో విష పురుగులు, సర్పాలు సంచరిస్తున్నాయి. ప్రస్తుతం పాఠశాలలో ఒక విద్యార్థి, ఒక ఉపాధ్యాయురాలు మాత్రమే ఉన్నారు. ప్రస్తుతం ఆమె కూడా సెలవులో ఉన్నారు. పర్యవేక్షించే వారు లేకపోవడంతో పాఠశాల ఆవరణమంతా అపరిశుభ్రంగా తయారైంది. గతంలో ఇక్కడ మద్యం సేవించగా, ఈవిషయాన్ని గ్రామస్తుల దృష్టికి తీసుకెళ్లారు.అయినా తిరిగి మద్యం సేవిస్తున్నారని ఆయావాపోయింది. కాగా ఇదేవిషయమై ఎంఈవో గేమ్‌సింగ్ వివరణ కోరగా, ఉపాధ్యాయురాలు సెలవులో ఉన్నారని, పాఠశాల ఆవరణాన్ని శుభ్రంగా ఉంచాలని ఆయాను ఆదేశించినట్లు తెలిపారు. గతంలో పాఠశాలలో ముగ్గురు విద్యార్థులు ఉండగా, ఇద్దరు హాస్టల్ వెళ్లిపోయారని ఆయన పేర్కొన్నారు.

ఆయిల్ పామ్ సాగుతో అధిక లాభాలు


రైతులకు అవగాహన కల్పిస్తున్న అధికారి శ్రీకాంత్

డిచ్‌పల్లి: ఆయిల్‌పామ్ సాగుతో రైతులు అధిక లాభాలు గడించే అవకాశాలున్నాయని డిచ్‌పల్లి మండల వ్యవసాయాధికారి శ్రీకాంత్ పేర్కొన్నారు. బుధవారం మండలంలోని డిచ్‌పల్లి ఖిల్లా గ్రామంలో ఆయిల్‌పామ్ సాగు, ప్రభుత్వం అందిస్తున్న సబ్సిడీపై రైతులకు అవగాహన కల్పించారు. రాష్ట్ర ప్రభుత్వం ఆయిల్ పామ్ సాగును ప్రోత్సహించేందుకు పలు రకాల సబ్సిడీలు అందజేస్తోందని అన్నారు. ఈ పంట ఒకసారి నాటితే నాలుగేళ్ల తర్వాత 30 ఏళ్ల పాటు నిరంతర ఆదాయం వస్తుందన్నారు. కోతులు ముట్టని, పందులు, దొంగల బెడద లేని, తక్కువ కూలీలు అవసరమయ్యే పంట ఆయిల్‌పామ్ అని ఆయన వివరించారు. ప్రభుత్వం ఆయిల్‌పామ్ పంట సాగును ప్రోత్సహించేందుకు మొక్కలకు 90 శాతం రాయితీ అందిస్తోందని పేర్కొన్నారు. రైతు కేవలం ఎకరానికి రూ. వేయి చొప్పున ఉద్యాన-పట్టుపరిశ్రమ అధికారి, నిజామాబాద్ పేరిట డీడీ చెల్లిస్తే 50 మొక్కలు యూనిక్ కంపెనీ వారిచే అందజేస్తామన్నారు. అలాగే ఆయిల్‌పామ్ పంట మధ్యలో అంతర పంటలుగా మొక్కజొన్న, జొన్న, పసుపు, కూరగాయలు, సోయా సాగు చేస్తే ఎకరానికి రూ.4,200 లు చొప్పున రైతు ఖాతాలో ఏడాదికి ఒకసారి జమచేస్తామన్నారు. కార్యక్రమంలో ఏఈవో లక్ష్మి ప్రసన్న, పంచాయతీ కార్యదర్శి వినయ్, ఖిల్లా రామాలయ కమిటీ చైర్మన్ శాంతయ్య, వీడీసీ సభ్యులు, సొసైటీ డైరెక్టర్ నర్సయ్య, రైతులు నర్సారెడ్డి, రాజిరెడ్డి, ప్రీ యూనిక్ కంపెనీ క్లస్టర్ ప్రతినిధి భూమేశ్ తదితరులు పాల్గొన్నారు.

పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలి


డెమో పాస్ స్ప్రే చేయిస్తున్న వైద్య సిబ్బంది

డిచ్‌పల్లి: సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ఉండాలంటే ప్రతి ఒక్కరూ తమ ఇంటితో పాటు పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని వైద్యాధికారిణి క్రిస్టినా సూచించారు. ఇందల్వాయి పీహెచ్‌సీ ఆధ్వర్యంలో బుధవారం డిచ్‌పల్లి మండలం యానంపల్లిలో ఉచిత ఆరోగ్య శిబిరాన్ని నిర్వహించారు. డాక్టర్ క్రిస్టినా తోపాటు ఎంఎల్‌హెచ్‌పీ మాలేహ సుల్తానా ఆధ్వర్యంలో గ్రామస్తులకు జ్వరం, రక్తపరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి మందులు అందజేశారు. అనంతరం గ్రామంలో ఇంటింటికి తిరిగి సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించారు. నీరు నిల్వ ఉన్న ప్రాంతాలను గుర్తించి నీటిని తొలగింపజేశారు. దోమల నివారణకు గ్రామంలోని ఇళ్ల చుట్టూ ఉన్న పరిసర ప్రాంతాల్లో డెమో పాస్ స్ప్రే చేశారు. కార్యక్రమంలో మండల ఆరోగ్య విస్తరణ అధికారి వై.శంకర్, మలేరియా సబ్ యూనిట్ ఆఫీసర్ రాజేందర్, ఆరోగ్య కార్యకర్తలు వెంకట్ రెడ్డి, గంగుబాయి, ఆశా కార్యకర్తలు సంధ్య, మంజుల, నిరోషా తదితరులు పాల్గొన్నారు.

సమాచారం..

నేడు నగరంలో షబ్బీర్ అలీ పర్యటన

నిజామాబాద్ సిటీ: ప్రభుత్వ సలహాదారు మహ్మద్ షబ్బీర్ అలీ జిల్లాకేంద్రంలో గురువారం పర్యటించనున్నట్లు నగర కాంగ్రెస్ అధ్యక్షుడు, నుడా చైర్మన్ కేశ వేణు బుధవారం తెలిపారు. మధ్యాహ్నం గోల్ హనుమాన్ ఆలయ కమిటీ సభ్యులు, కసాబ్‌గల్లిలో ఆరె కటిక సంఘం నాయకుల ప్రమాణ స్వీకారానికి హాజరు కానున్నట్లు పేర్కొన్నారు. సాయంత్రం 4 గంటలకు అమృత్ 2.0 పథకంలో భాగంగా నగరంలో నిర్మిస్తున్న పనులను, గణేశ్ నిమజ్జనం సందర్భంగా నిర్వహించే శోభాయాత్ర రూట్‌మ్యాప్‌ను సైతం పరిశీలించనున్నట్లు కేశ తెలిపారు.